మా ప్రయత్నంతోనే నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం


సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌బీసీ చైర్మన్ డీవీమనోహర్, అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

- వరల్డ్ సైక్లింగ్ అలయన్స్(డబ్ల్యూసీఏ) తొలి ఉపాధ్యక్షుడు, హెచ్‌బీసీ చైర్మన్ డీవీ మనోహర్
- పాలపిట్ట సైక్లింగ్‌పార్కులో సైక్లింగ్ ఈవెంట్

రాయదుర్గం: నగరంలో హెచ్‌బీసీ ఆధ్వర్యంలో 2010లో సైక్లింగ్ విప్లవం తీసుకొచ్చిందని వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ తొలి ఉపాధ్యక్షుడు, హెచ్‌బీసీ చైర్మన్ డీవీ మనోహర్ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్, స్మార్ట్ బైక్, బ్రస్సెల్స్‌లోన వరల్డ్ సైక్లింగ్ అయన్స్‌తో కలిసి ప్రధాన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేయడంతోనే జూన్3వ తేదీని యూఎన్‌ఓ ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ప్రకటించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంలో మిషన్ మోడ్‌లో సైక్లింగ్‌ను ప్రోత్సహించడంతోపాటు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్‌ను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు నగరంలో ప్రస్తుతం చాలా మంది సైక్లింగ్ పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారని, కానీ మరింత ఆసక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌బీసీ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి మట్లాడుతూ హెచ్‌బీసీ నగరంలో సైక్లింగ్ పట్ల ప్రజలందిరిలో ఆసక్తిని పెంచడం, నిత్యం సైకిల్ తొక్కాలనే భావన పెరుగుతోందన్నారు. ప్రభుత్వాలు కూడా సైకిల్ ట్రాక్‌ల నిర్మాణంపై దృష్టిసారిస్తున్నాయంటే హెచ్‌బీసీ చేసిన కృషియే కారణమన్నారు. మరిన్ని సైక్లిల్ ట్రాక్‌ల నిర్మాణం చేయాలని, ప్రస్తుతం చేపట్టినవి, ప్రతిపాదనలలో ఉన్నవి పూర్తి చేయాలన్నారు. తరచూ హెచ్‌బీసీ ఆధ్వర్యంలో సైక్లింగ్ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీసీ ప్రతినిధులు, వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ ప్రతినిధులు, పలువురు సైక్లిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా 'డీఫ్లాప్ టెక్నాలజీస్' మూడో వార్షికోత్సవం


వార్షికోత్సవ వేడుకల్లో సంస్థ అధికారులు, ఉద్యోగులతో టీహబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావు

గచ్చిబౌలి: డీఫ్లాప్ టెక్నాలజీస్ సంస్థ మూడో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా ఆదివారం జరుపుకున్నారు. గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయాన్ని ప్రత్యేక అలంకరించారు. సంస్థ ఉద్యోగులు, అధికారులు సిబ్బంది ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీ హబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థకు స్టార్టప్‌ల గణనీయమైన సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. ఏ సంస్థ అయినా తమ ఖాతాదారులను జాగ్రత్తగా చూసుకుంటే ఖాతాదారులు ఆ సంస్థను జాగ్రత్తగా ఎదిగేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తారన్నారు. ఐటీ, స్టార్టప్ సంస్థలకు తమ వంతూ టీహబ్ సహకారాన్ని అందిస్తుందన్నారు. ఆయా సంస్థలు నూతన ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఫ్లాప్ టెక్నాలజీస్ సంస్థ ఏడాది కాలంలో అనేక విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో ఇదే లక్ష్యంతో ముందుకుసాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో షడ్బుజిలో ఇన్నోవే షన్ హెడ్ పృథ్వీ చైతన్య, ఎంఎస్‌ఐఎల్ ఇన్నోవేషన్ మేనేజర్ సాయిబల్ త్రివేది, ఆర్‌జీవీ సోదరి విజయ, లగడపాటి జానకి, ఐడీఆర్‌బీటీ మాజీ డైరెక్టర్ డాక్టర ఏఎస్‌రామశాస్త్రి, విమలాదిత్య, టీహబ్ సీనియర్ ఇన్నోవేసస్ లీడర్ వినయ్ పెద్దింటి, టీఎంఐ వద్ద సీటీఓ సమీర్‌గోస్వామి, వాసవి ఇన్‌స్టిట్యూట్స్ ప్రొఫెసర్ డాక్టర్ తిలోత్తమ గోస్వామి, డీఫ్లాప్ టెక్నాలజీస్ సీఈఓ కె. సూర్యప్రకాశ్, సీటీఓ చంద్రధర్ చెరుకువాడ, డీఫ్లాప్ టెక్నాలజీ సంస్థ పెట్టుబడిదారులు, భాగస్వాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యానికి ఎంతో మేలు

స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్‌మన్నం


సైకిల్‌రైడ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న గోపీచంద్‌మన్నం తదితరులు

రాయదుర్గం: అందరూ సైక్లింగ్, వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని, ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొగాకు వాడకం, ఆరోగ్యంపై అది కలిగించే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్, సమతా యువ సంఘంతో కలిసి స్టార్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రి ఆవరణలో సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 200 మంది ఔత్సాహికులతో 25 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌ను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో నిర్వహించగా అందులో పాల్గొనగా సీనియర్ వైద్యులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలినడక, సైకిల్ తొక్కడానికి సురక్షితమైన మౌలిక సదుపాయాలను సృష్టించడం అత్యావసరమన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం కాలినకడ, సైక్లింగ్ కోసం సురక్షితమైన మౌలిక సదుపాయాలు కూడా ప్రధాన ఆరోగ్య సమానత్వాన్ని సాధించడానికి ఒక మార్గమన్నారు. తరచుగా ప్రైవేటు వాహనాలను కొనుగోలు చేయలేని పట్టణ ప్రాంతానికి చెందిన పేద, మధ్యతరగతి వర్గాల వారికి వాకింగ్ సైక్లింగ్ ఒక రకమైన రవాణా సౌకర్యాన్ని అందించగలవన్నారు. గుండెజబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల కేన్సర్లు , మధుమేహం వంటి వ్యాధుల మరణాలను తగ్గించడమే కాకుండా మెరుగైన, చురుకైన రవాణాతో పాటు ఇది ఆరోగ్యకర మైందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పలువురు వైద్యులు, అధికారులు, సిబ్బంది హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూపు ప్రతినిధులు, సమతా యువసంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైక్ రేస్‌లతో హడలెత్తిస్తున్న యువకులు


సీజ్ చేసిన స్పోర్ట్స్ బైక్‌లను పరిశీలిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

- 50 స్పోర్ట్స్ బైక్‌లు సీజ్
- భారీ జరిమానా విధించే విధంగా చర్యలు : డీసీపీ వినీత్

గచ్చిబౌలి: రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీహబ్ జంక్షన్‌లో స్పోర్ట్స్ బైక్‌లతో రేస్, స్టంట్లు నిర్వహిస్తూ యువకులు అటుగా వెళ్లే ప్రయాణీలను హడలెత్తిస్తున్నారు. ప్రమాదకరమని తెలిసినా అర్ధరాత్రి స్టంట్లు చేస్తూ పోటీ పడుతున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత నిబంధనలు బేఖాతర్ చేస్తూ స్పోర్ట్స్ బైక్‌లతో స్టంట్లు చేస్తున్న వారిని రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న, 30 మంది సిబ్బంది బైక్‌లను వెంబడించి పట్టుకున్నారు. దాదాపు 50 స్పోర్ట్స్ బైక్‌లను సీజ్ చేశారు. టిహబ్ నుంచి ఐటీసీ కోహినూర్, సత్వ బిల్డింగ్, హై భూజ తదితర ప్రాంతాలలో రేస్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన స్పోర్ట్స్ బైక్‌లను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో బైక్‌లను నడుపుతూ యువకులు పట్టుబడ్డారని తెలిపారు. రూ.80 వేల నుంచి ఆరేడు లక్షల విలువ చేసే బైక్‌లను సీజ్ చేశామని తెలిపారు. గతంలోను రేస్ నిర్వహిస్తూ పట్టుబడ్డారని, అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. కొన్ని బైక్‌లు రిజిస్ట్రేషన్ కూడా చేయలేదన్నారు. విద్యార్థులే ఎక్కువగా ఉన్నారని, అందరి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సినిమాలు, యాడ్స్ చూసి రోడ్లను బ్లాక్ చేసి మరీ స్టంట్స్, రేస్ చేస్తున్నారని, దీంతో వారికే కాకుండా అటుగా వెళ్లే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కొందరు రేస్‌లో బెట్టింగ్ చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఐపీసీ 336, 341, ఎంవీ యాక్ట్ సెక్షన్ 184 ప్రకారం కేసు నమోదు చేశామని వివరించారు. యువత బైక్‌లతో ప్రమాదకరమైన రేస్, స్టంట్లు వేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం


మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయంతిరెడ్డి, పాల్గొన్న మహిళలు

మోతీనగర్: గర్భిణీ సమయంలో పౌష్టికాహారం తీసుకుని, వైద్యుల సూచన మేరకు మందులు వాడితే పుట్టబోయే శిశువు ఆరోగ్యవంతంగా జన్మిస్తారని జేజే ఆసుపత్రి సీఎండీ, ప్రముఖ గైనకాలజిస్ట్ డా. జయంతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ శృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జేజే ఆసుపత్రి, సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్, సాయిప్రసాద్ సేవ ట్రస్ట్ మహిలలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. జయంతిరెడ్డి సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఆర్ మూర్తి డాక్టర్ ఎస్‌వీ. ప్రసాద్, ఎస్‌ఎన్ బైరెడ్డి, పీఏఎస్ మూర్తి పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో అమరవీరుల స్థూపం వద్దకు వెళ్శన ఎమ్మెల్యే గాంధీ


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కమాండెంట్ సన్నీ

అంబరాన్నంటేలా రాష్ట్ర అవతరణ వేడుకలు

జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన శేరిలింగంపల్లి జంట సర్కిళ్లు

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలతో జాతీయ పతాకావిష్కరణలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: 'జై తెలంగాణ.....జైజై తెలంగాణ' వంటి నినాదంతో శేరిలింగంపల్లి జంట సర్కిళ్లు మార్మోగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ళు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ ద్వారా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల గురించి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు గుర్తుకు చేసుకున్నారు. అమరులందరికీ నివాళులు అర్పించారు. ఉదయం నుంచే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ళ వద్ద తెలంగాణ ఉద్యమ గీతాలతో కూడిన పాటలపెట్టి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

అమరవీరుల స్థూపం వద్దకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి ప్రాంతం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నగరంలోని అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా వెళ్శారు. ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు 'జై తెలంగాణ, జైజై తెలంగాణ.....కేసీఆర్, కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు.


జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్, నిథమ్ ఇన్‌చార్జీ డైరెక్టర్ కె.నిఖిల తదితరులు


వార్డు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పీ రూపేష్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈనెల 4వ తేదీన కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం ఏడు గదుల్లో ఒక్కోదాంట్లో 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. కౌంటింగ్ సిబ్బందికి ప్రతీ ఒక్కరికి పాసులు ఇవ్వడం జరిగిందని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. పాసులు లేకుంటే ఎవరినీ అనుమతించమని చెప్పారు. మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని, అక్కడి నుంచే కౌంటింగ్ తీరును కవర్ చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ ఐఏఎస్ మనోజ్, డీఆర్‌ఓ పద్మజారాణి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మోతీనగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే పునర్జన్మ కల్పించినట్లేనని అన్నారు. అత్యవసర సమయంలో ఉన్నప్పుడు రక్తదానం చేయటంతో వారి ప్రాణం కాపాడిన వారవుతామన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ రోణంకి జగన్నాథం, సెక్రటరీ ఖలీల్ పాల్గొన్నారు.

జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభం


జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శనలో టాలీవుడ్ వర్ధమాన నటి రాధిక రాయవరపు..

బంజారాహిల్స్: గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శనను ఆదివారం టాలీవుడ్ వర్ధమాన నటి రాధిక రాయవరపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటికీ వాటిపై మక్కువ తగ్గలేదన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారన్నారు. చేనేత కళాకారులు ఎంతో శ్రమకోర్చి రూపొందించే వస్త్ర ఉత్పత్తులను అందరూ ఆదరించినప్పుడే వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందన్నారు. ప్రదర్శన నిర్వాహకులు జయేష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ ఈ నెల 9 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ నృత్య ప్రదర్శనలతో సందర్శకులను కళాకారులు ఆకట్టుకున్నారు. మైసూరికి చెందిన భరతనాట్య కళాకారులు శ్రీవిద్యరావు, వర్ణఆర్ట్స్ అకాడమీ స్మిత మాదవ శిష్యబృందంచే భరత నాట్య ప్రదర్శన అర్చన మిశ్ర బృందంచే కథక్ , సస్మితామిశ్ర బృందంచే ఒడిస్సీ, సౌందర్యకౌశిక్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు పాల్గొని కళాకారులను అభినందించారు.

రియల్ ఎస్టేట్ రంగంలోనే కొత్త ఒరవడి

అత్యాధునిక మొబైల్ అప్లికేషన్ ప్రారంభించిన ప్రాక్స్‌పేస్


నూతన యాప్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్నత్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం: రియల్ ఎస్టేట్ రంగంలో ఒక విప్లవాత్మక మార్పుకు ప్రాక్స్‌పేస్ శ్రీకారం చుట్టింది. ఆదివారం రాత్రి అత్యాధునిక మొబైల్ ఆప్లికేషన్‌ను లాంఛనంగా ప్రారంభించింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ప్రాక్స్‌పేస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాక్స్‌పేస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్నత్ రెడ్డి చేతుల మీదుగా ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ప్రాక్‌పేస్ యాప్ పారదర్శక ప్లాట్‌ఫారమ్‌ను అందించడం ద్వారా రియల్ ఎస్టేట్ ల్యాండ్‌స్కేప్‌ను పునర్నిర్వచించడానికి సెట్ చేయబడిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాక్స్‌పేస్ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్నత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో 2040 నాటికి ప్రాక్స్‌పేస్ సంస్థ మార్కెట్ ట్రీ మిలియన్ డాలర్లు ఉంటుందని భావిస్తున్నామన్నారు. మొట్టమొదటిసారిగా దేశంలో 100 శాతం పార దర్శకతతో కూడిన యాప్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. హైదరాబాద్ నగరంలో కూడా ఇలాంటి యాప్‌లు ఎవరూ ఆరంభించలేదని మా భావన అన్నారు. ఏడాది క్రితం ముగ్గురితో ఆరంభించి ప్రస్తుతం 40 మందికి పెంచగలిగామన్నారు. ఈ యాప్‌ను వినియోగించి రియల్ ఎస్టేట్ వ్యవహారాలను పరిశీలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'టీహబ్'లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు, టీహబ్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీహబ్ సీఈఓ ఎం. శ్రీనివాసరావు టీహబ్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్ళు పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. గత పదేళ్ళలో తెలంగాణ అవకాశాల కేంద్రంగా రూపాంతరం చెందడానికి పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక కేంద్రంగా మారిందన్నారు. గతంలోనే కాకుండా భవిష్యత్తులో కూడా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని, సాంకేతిక, ఆర్థిక అభివృద్ధికి ఒక కేంద్రంగా మారడం ఖా యమన్నారు. టీహబ్ నిరంతరం నూతన ఆవిష్కరణలు, పురోగతి ద్వారా తెలంగాణ అభివృద్ధికి దోహదపడేందుకు తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీహబ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, స్టార్టప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీఈఓ ఎం. శ్రీనివాసరావు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు

మనస్ఫూర్తిగా కర్తవ్య నిర్వహణ చేయాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు బలమైన పునాది వేసేందుకు పోలీసులు మనస్ఫూర్తిగా కర్తవ్య నిర్వహణ చేయాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. ఆదివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి నేటితో పదేళ్ల నిండిందని, అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, డీసీపీలు వినీత్, నారాయణ రెడ్డి, శ్రీనివాస్, నితికా పంత్, నర్సింహ్మా కొత్తపల్లి, డీవీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

సరదా..సరదాగా...

బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొన్న వైద్యులు


బహుమతులను అందజేస్తున్న పల్స్‌హార్ట్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ముఖర్జీ

మాదాపూర్: ఎప్పుడు బిజీబిజీగా ఉండే డాక్టర్లకు మాదాపూర్‌లోని గేమ్‌పాయింట్‌లో ఆదివారం బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణలోని వేర్వేరు ప్రదేశాలు, ఆసుపత్రులకు చెందిన వైద్యులు పాల్గొని టోర్నమెంట్‌లో సరదాగా గడిపారు. డాక్టర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో జరిగే ఈ ప్రత్యేక టోర్నమెంట్ ద్వారా వైద్యులు తమలోని క్రీడా ప్రతిభను చాటారు. వైద్యులకు శారీరక, మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని సమతుల్య జీవన విధానాన్ని పెంపొందించుకోవాలని పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ముఖర్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, డాక్టర్ సంజూష, డాక్టర్ మువ్వా శ్రీనివాస్, డాక్టర్ సాయిచంద్ర, డాక్టర్ తనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలోకు రూపాయల్లో ఈ విధంగా ఉన్నాయి. టమాట 40, పచ్చిమిర్చి 75, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 35, చామ 60, కీర 40, బీర 80, వంకాయ 40, గోకర 70, బీన్స్ 160, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 120, ఉల్లి 30 (కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280లుగా ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

జోరందుకున్న బెట్టింగ్ !

రాజేంద్రనగర్: లోక్‌సభ ఎగ్జిట్‌పోల్‌ను వివిధ సంస్థలు ప్రకటించడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బెట్టింగ్‌లకు తెరలేపారు. ప్రధానంగా చేవెళ్ల పార్లమెంటులో తమ పార్టీ గెలుస్తుందంటూ.. బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. శనివారం సాయంత్రం వివిధ సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్‌ను ప్రకటించాయి. జాతీయ స్థాయితో పాటు రాష్ట్రంలో ఏయే పార్టీలు ఎన్ని సీట్లు గెలుస్తున్నాయోననే అంచనా వేస్తూ సర్వేను ప్రకటించారు. నియోజకవర్గంలో జాతీయ స్థాయిలో పార్టీల సీట్ల కంటే చేవెళ్ల పార్లమెంటులో తమ అభ్యర్థి గెలుస్తున్నాడంటూ.. బెట్టింగ్‌లను పెద్దఎత్తున కాస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు సైతం పాల్గొంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా చేవెళ్ల పార్లమెంటులో పోటీ రసవత్తరంగా సాగింది. నువ్వా.. నేనా అన్న రీతిలో ప్రచారం నిర్వహించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు అనంతరం ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకు తీసుకురావడంలో విజయవంతమయ్యారు. దీంతో చేవెళ్ల పార్లమెంటులో పోలింగ్ శాతం పెరిగింది. ఇది తమకే అనుకూలమంటూ ప్రస్తుతం బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వందల నుంచి లక్షల్లో ఈ బెట్టింగ్ సాగుతుంది. నిన్న మొన్నటి దాకా నిశబ్దంగా ఉన్న నాయకులు ఎగ్జిట్‌పోల్ రాగానే బెట్టింగ్‌లకు తెరలేపారు. ప్రస్తుతం 4న ఓట్ల లెక్కింపు ఉండటంతో తమ ముఖ్య అనుచరులతో సంప్రదింపులు జరిపి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

సేవా కార్యక్రమాలను విస్తరిస్తాం

వీఆర్‌ఫర్‌యూ సంస్థ అధ్యక్షుడు బాపూజీ

మణికొండ: మనకు ఉన్న దాంట్లో కొంత సమాజానికి, పేదలకు ఖర్చుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతో మానసిక తృప్తి కలుగుతుందని వీఆర్‌ఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బాపూజీ అన్నారు. సంస్థ 7వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం మణికొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరుపేదలను ఆదుకునేలా భవిష్యత్తులో కార్యక్రమాలను చేపడతామన్నారు. తమ సంస్థ ఎలాంటి విరాళాలు సేకరించకుండా సభ్యులే నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి సీతారాందాస్, సభ్యులు రాంబాబు, రామసుబ్బయ్య, నాగభూషణం, ప్రదీప్‌రావు, కుమార్, సాంబశివరావు, నాగేంద్రరావు, పీఎస్‌వీ కుమార్, కన్నయ్య పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యాలు పెరగాలి


వట్టినాగులపల్లిలో ఆటోకేర్‌ను ప్రారంభిస్తున్న బండ ప్రకాశ్, ఎమ్మెల్యే

మణికొండ: హైదరాబాద్ నగర శివారు గండిపేట మండలంలో నివసించేందుకు దేశవ్యాప్తంగా ప్రజలు వస్తున్నారని, వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు స్థానికంగానే కల్పించాల్సిన అవసరం ఉందని శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డులో ఖానాపూర్‌కు చెందిన తలారి మాణిక్‌రాజ్ ఏర్పాటు చేసిన లక్ష్మీ ఆటోకేర్ గ్యారేజ్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గండిపేట మండల పరిధిలోని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, టవర్ నిర్మాణాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇలాంటి చోట వారికి అవసరమైన వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు, ఆటోకేర్ సంస్థలు రావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక యువకులు ఇలాంటి వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని తాము జీవనోపాధి పొందటంతో పాటు మరో 10 మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.